సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025

విశాఖ చేరుకున్న మహిళా క్రికెటర్లు







రేణుక



రీచా



ప్రతీక

విశాఖ స్పోర్ట్స్: భారత మహిళల క్రికెట్ జట్టు విశాఖ చేరుకుంది. ప్రత్యేక విమానంలో కొలంబో నుంచి విశాఖ వచ్చిన మహిళల జట్టుకు విమానాశ్రయంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. మహిళా క్రికెటర్లతో ఫొటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. టోర్నీలో భాగంగా ఐదు వన్డే మ్యాచ్‌లకు డా.వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. భారత్ జట్టు ఈనెల 9న దక్షిణాఫ్రికాతోను, 12న ఆస్ట్రేలియాలతో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్నాయి. మహిళల ప్రపంచ కప్‌కు భారత్ తొలిసారిగా 1997లో కోల్‌కతా వేదికగా ఆతిథ్యమివ్వగా, ఇప్పుడు శ్రీలంకతో కలిసి మరోసారి నిర్వహిస్తోంది.

యాప్ రోగం

- ఏబీహెచ్‌ఏ యాప్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు
- ఓపీ టికెట్ల కోసం రోగుల పడిగాపులు





కేజీహెచ్ ఓపీ టికెట్ల జారీలో సర్వర్ సమస్యతో క్యూలో ఇబ్బంది పడుతున్న రోగులు

మహారాణిపేట: కేజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగంలో సోమవారం రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ యాప్ (ఏబీహెచ్‌ఏ) ద్వారా ఓపీ టికెట్ల జారీలో ఆన్‌లైన్ సర్వర్ సమస్య కారణంగా జాప్యం జరిగింది. సోమవారం, ముఖ్యంగా దసరా పండుగ తర్వాత కావడంతో, ఓపీకి రోగుల సంఖ్య భారీగా పెరిగింది. నిత్యం 1200 నుంచి 1300 టికెట్లు జారీ చేసే కౌంటర్ల వద్ద సోమవారం దాదాపు 1800 మందికి ఓపీలు, 80 మందికి కే-షీట్‌లు జారీ చేశారు. ఆరు కౌంటర్లు రోగులు, వారి బంధువులతో కిక్కిరిసిపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు రద్దీ కొనసాగింది.

'యాప్'సోపాలు

ఒకవైపు సర్వర్ సమస్యతో పాటు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఏబీహెచ్‌ఏ యాప్ ద్వారా టికెట్లను జారీ చేయడంలోనూ రోగులు అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులు స్మార్ట్‌ఫోన్ లేక, యాప్ డౌన్‌లోడ్ చేయలేక గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. సిగ్నల్ లేకపోవడం, ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, వేలిముద్రలు సక్రమంగా పడకపోవడం వంటి కారణాల వల్ల యాప్ డౌన్‌లోడ్ ప్రక్రియ ఆలస్యమై, రోగులు మరింత ఎక్కువ సమయం కౌంటర్ల వద్ద నిరీక్షిస్తున్నారు. ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోవడంతో టికెట్లు జారీ నిలిచిపోయి, కౌంటర్ల వద్ద రద్దీ పెరగడంతో రోగులు, వారి బంధువులను అదుపు చేయడం సెక్యూరిటీ సిబ్బందికి కూడా కష్టమవుతోంది.

ఆకాశంలో అద్భుతం

పౌర్ణమి అంటేనే చందమామ నిండు పున్నమితో దేదీప్యమానంగా కనిపిస్తుంది. మరి.. సూపర్‌మూన్ అంటే ఎలా ఉంటుందో తెలుసా.? సోమవారం కనిపించిన జాబిలిని చూస్తే.. ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. సాధారణ పరిభాషలో సోమవారం శరత్‌పూర్ణిమ అని శారదీయ పౌర్ణమి అని పిలుస్తారు. ఈ రోజున భూమికి చాలా దగ్గరగా చంద్రుడు వచ్చాడు. అందుకే.. ఎప్పుడూ పౌర్ణమికి కనిపించే చందమామలా కాకుండా.. 14 శాతం పెద్దగా.. 30 శాతం ఎక్కువ ప్రకాశవంతంగా కనిపించాడు. దీన్నే హార్వెస్ట్‌మూన్ అని కూడా పిలుస్తారు. హిందూ సంప్రదాయం ప్రకారం.. శరత్ పూర్ణిమ రోజున చంద్రుని కిరణాలు అమృతంతో సమానమని అంటారు. అందుకే.. ఈ రోజున ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పవిత్రమైన రోజుగా భావిస్తారు. – సాక్షి,ఫొటోగ్రాఫర్, విశాఖ



విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళనలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

జీవీఎంసీ గాంధీబొమ్మ వద్ద 11 జిల్లాల ఉద్యోగుల ఆందోళన

టీచర్స్‌కాలనీ: గతంలో కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు 11 జిల్లాల విద్యుత్ ఉద్యోగులు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏపీఎస్‌పీఈఈ చైర్మన్ ఎస్. కృష్ణయ్య, కన్వీనర్ ఎంవీ రాఘవ రెడ్డి మాట్లాడుతూ యాజమాన్యాలకు, రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అందుకే విధిలేని పరిస్థితుల్లో ప్రజాస్వామ్యబద్ధంగా దశలవారీ ఆందోళన కార్యక్రమాలు రూపొందించుకున్నామని తెలిపారు. జూనియర్ లైన్ మెన్ గ్రేడ్-2 లకు వర్తింపజేసిన కొత్త సర్వీసు నిబంధనలను తక్షణమే రద్దు చేసి, పాత నిబంధనలు అమలు చేసి సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులలో జూనియర్ లైన్మెన్ గ్రేడ్-2 లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. 1999 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీపీఎఫ్ , పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.


కార్మిక చట్టాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం నిబంధన అమలు చేసి, పొరుగుసేవల సిబ్బందికి, కాంట్రాక్టు కార్మికులకు విద్యుత్ సంస్థలే నేరుగా వేతనాలు, అలవెన్సులను చెల్లించే ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు వాయిదాల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, నగదు రహిత అపరిమిత వైద్య సౌకర్యాన్ని తక్షణమే అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులలో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించి, తమ ముఖ్యమైన సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఏపీఎస్‌పీఈఈ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కో-చైర్మన్ కె.వి. శేషారెడ్డి, డిస్కం యూనిట్ చైర్మన్ గణపతి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం నేతలు

పోర్టు పరవళ్లు

- వైజాగ్ పోర్టు ఏర్పడి నేటికి 92 ఏళ్లు
- మేజర్ పోర్టులతో పోటీపడుతూ అభివృద్ధి పనులు
- కవర్డ్ స్టోరేజ్ యార్డులు నిర్మాణం, బెర్త్‌ల పునరుద్ధరణ పనులు
- అందుబాటులోకి మోడ్రన్ పోర్ట్ ఆపరేటింగ్ సిస్టమ్



సాక్షి, విశాఖపట్నం : ఈస్ట్‌కోస్ట్ గేట్ వే ఆఫ్ ఇండియాగా నౌకాయానంలో అంతర్జాతీయంగా ఎదుగుతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ నేటితో 92 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఏటికేడూ ప్రగతి పథంలో పయనిస్తూ.. నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ దేశంలోని మేజర్ పోర్టులతో పోటీ పడుతూ సరికొత్త వ్యూహాల్ని అనుసరిస్తోంది. పెట్టుబడుల ప్రవాహం.. పెరుగుతున్న సామర్థ్యానికి అనుగుణంగా విస్తరణ పనులతో పోర్టు వచ్చే ఆవిర్భావ దినోత్సవానికి సరికొత్త సొబగులద్దుకోనుంది. మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీల విస్తరణ, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతుండటంతో.. విశాఖ పోర్టు ప్రపంచ వాణిజ్య కేంద్రానికి చిరునామాగా మారనుంది. ఈ ఏడాది స్వచ్ఛతా అవార్డుల్లో దేశంలో ప్రథమ స్థానం సాధించింది.

తొలి పాసింజర్ షిప్ జలదుర్గతో..

1927లో విశాఖపట్నం పోర్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1933 అక్టోబర్ 7న పోర్టు నుంచి సరకు రవాణాని ప్రారంభించింది. సింధియా స్టీమ్ నేవిగేషన్ కంపెనీ తొలి పాసింజర్ షిప్ జలదుర్గని విశాఖ పోర్టుకు తీసుకొచ్చింది. అప్పటి వైస్రాయ్, గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా లార్డ్ విల్లింగ్ డన్ నౌకాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విశాఖపట్నం హార్బర్‌ను సుందరంగా తీర్చిదిద్దడంలో ఇంజనీర్లు డబ్ల్యూసీ యాష్, ఓబీ రాటెన్‌బరీలు ముఖ్య భూమిక పోషించారు. పోర్టుకు సమీపంలోనే స్టీల్‌ప్లాంట్, సెయిల్, ఎన్టీపీసీ, నాల్కో, ఎన్‌ఎండీసీ, హిందూస్థాన్ షిప్ యార్డు, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, హెచ్‌పీసీఎల్ వంటి భారీ పరిశ్రమలున్నాయి. పోర్టులో ప్రధానంగా స్టీల్, పవర్, మైనింగ్, పెట్రోలియం, ఎరువులు తదితర సరుకుల్ని నిర్వహిస్తోంది. దేశంలోనే అత్యంత లోతైన కంటైనర్ టెర్మినల్ పోర్టులోనే ఉండటం విశేషం.

సరికొత్త సంస్కరణలు..సాంకేతిక పరుగులు

గ్రీన్ పోర్టుగా తీర్చిదిద్దేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే 10 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్‌ని ఏర్పాటు చేసి.. పోర్టుకు అవసరమైన విద్యుత్‌మొత్తాన్ని సొంతంగా ఉత్పత్తి చేసుకుంటోంది. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా మరో 190 కిలోవాట్ల విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తోంది. 2055-26 నాటికి 30 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు.

- ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.150 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు ప్రారంభించింది. త్వరలోనే పనులు పూర్తి కానున్నాయి.
- 845 మీటర్ల పొడవు, 16 మీటర్ల సహజ సిద్ధమైన లోతును కలిగి విశాఖ కంటైనర్ టెర్మినల్ కంటైనర్ ట్రాఫిక్ కు ముఖ ద్వారంలా ఉంది. ఏపీ, తెలంగాణా, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర జార్ఖండ్, మధ్యప్రదేశ్ , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు విశాఖ కంటైనర్ టెర్మినల్ గేట్ వేగా వ్యవహరిస్తోంది.
- మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రపంచ స్థాయి ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను 666 వాహనాల పార్కింగ్ సామర్థ్యంతో నిర్మించింది. 84,000 టన్నుల సరుకును నిల్వ ఉంచే విధంగా కవర్డ్ స్టోరేజ్ షెడ్ నిర్మాణాలు, యార్డు నిర్మాణం పూర్తి చేసింది.
- పోర్టులోని కార్యకలాపాల్ని యాంత్రీకరించే ప్రక్రియ జోరందుకుంది. రూ.655 కోట్లతో ఈక్యూ-7, వెస్ట్ క్యూ-7, 8 బెర్త్ లను యాంత్రీకరించే పనులు పీపీపీ పద్ధతిలో చేపడుతున్నారు.
- రూ.800 కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, సీఎన్జీ బంకరింగ్ స్టేషన్ నెలకొల్పేందుకు హెచ్‌పీసీఎల్, ఐఓసీతో ఎంవోయూ కుదుర్చుకుంది.
- రూ.276 కోట్లతో ఆయిల్ రిఫైనరీ బెర్త్-2 నిర్మాణం, అడ్వాన్స్‌డ్ ఫైర్‌ఫైటింగ్ ఫెసిలిటీ, ఆర్‌ఎఫ్‌ఐడీ గేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, మోడ్రన్ పోర్టు ఆపరేటింగ్ సిస్టమ్‌ని ప్రారంభించారు.
- ఇటీవలే ఏడు దేశాలకు ఆతిథ్యమిస్తూ బిమ్స్‌టెక్-2025 కాంక్లేవ్‌ని విజయవంతంగా వీపీఏ నిర్వహించింది.

ఎంటెక్ రెగ్యులర్, ఈవినింగ్ కోర్సులకు ప్రవేశాలు

మద్దిలపాలెం: ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ రెగ్యులర్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డీఏ నాయుడు సోమవారం తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 15 వరకు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుతో పాటు రూ.2 వేలు డీడీ అందించాలని పేర్కొన్నారు. 17న ఉదయం 10 నుంచి బ్రాంచ్‌ల వారీగా ఆయా బ్రాంచ్‌లలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు www.audoa.andhrauniversity.edu.in ను సందర్శించాలని సూచించారు.

- ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో అందించే వివిధ ఎంటెక్ సాయంత్రం కోర్సులకు కూడా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఏ నాయుడు తెలిపారు. 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు, ఇన్ఫర్మేషన్ బ్రోచర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ స్టేడియంలో మిథాలీ స్టాండ్, కల్పన గేట్

విశాఖ స్పోర్ట్స్: డా.వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మిథాలీరాజ్ స్టాండ్, కల్పన గేట్ ఏర్పాటు చేయనున్నారు. మహిళా వరల్డ్ కప్‌లో భాగంగా విశాఖ వేదికగా ఆస్ట్రేలియాతో తలపడనున్న భారత్ మ్యాచ్ సందర్భంగా ఈ నెల 12న వీటిని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రపంచకప్ పోటీలకు సిద్ధమవుతున్న తరుణంలో భారత్ జట్టు విశాఖ వేదికగానే ప్రాక్టీస్ చేసింది. ఆ సమయంలో జట్టును కలిసిన మంత్రి నారా లోకేష్‌తో బ్రేకింగ్ బౌండరీస్ పేరిట జరిగిన కార్యక్రమంలో స్టార్ బ్యాటర్ స్మృతిమంధాన మాట్లాడింది. మహిళా క్రికెట్‌లో ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించింది. దానిలో భాగంగానే మిథాలీరాజ్ స్టాండ్, కల్పన గేట్‌ను వైఎస్సార్ స్టేడియంలో ఏర్పాటు చేసేందుకు ఏసీఏ ముందుకు వచ్చింది. మిథాలీ వుమెన్ వన్డేల్లో 7,805 పరుగులతో అత్యధిక రన్ స్కోరర్ కాగా, స్థానిక క్రీడాకారిణి కల్పన ఏడు వన్డేల్లో కీపర్, బ్యాటర్‌గా సేవలందించింది.

స్పెషల్ కేటగిరీలో జీవీఎంసీకి అవార్డు



సీఎం చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీకి స్వచ్ఛాంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. స్పెషల్ కేటగిరీల్లో జీవీఎంసీకి వచ్చిన ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం అందుకున్నారు. అలాగే ఎంవీపీ రైతు బజార్‌కు అవార్డు లభించింది. రైతు బజార్ ఈవో వరహాలు, జిల్లా మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

రేపటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

ఎంవీపీకాలనీ: జాతీయ తపాలా వారోత్సవాలు-2025లో భాగంగా బుధవారం నుంచి 14వ తేదీ వరకు ఉచితంగా ఆధార్ నమోదు, మ్యాన్‌డెట్రీ బయోమెట్రిక్ అప్‌డేట్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తపాలా శాఖ రీజినల్ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రజలకు ఈ సేవలు అందుబాటులో ఉండేలా తపాలా కార్యాలయాలు, అలాగే కొన్ని పాఠశాలలు, నివాస కాలనీల వంటి నిర్దేశించిన ప్రాంతాల్లో ఈ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేస్తారు. ప్రజలందరూ ఈ ఉచిత సేవలను వినియోగించుకోవాలని తపాలా శాఖ విజ్ఞప్తి చేసింది.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉవ్వెత్తున ఉద్యమం

- 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించనున్న మాజీ సీఎం వైఎస్ జగన్
- 7 నియోజకవర్గాల మీదుగా రోడ్ షోగా వెళ్లే అవకాశం
- వైఎస్ జగన్‌ను కలవనున్న స్టీల్ ప్లాంట్, షుగర్ ఫ్యాక్టరీ, బల్క్ డ్రగ్ పార్క్ బాధితులు
- వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, సీఈసీ సభ్యుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్ సీపీ ఉవ్వెత్తున ఉద్యమిస్తోందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం మద్దిలపాలెంలో గల పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో మెడికల్ కళాశాలను సందర్శించనున్నారని తెలిపారు. ఈ పర్యటన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏడు నియోజకవర్గాల మీదుగా రోడ్ షోగా సాగుతుందన్నారు. వైఎస్ జగన్‌ను స్టీల్ ప్లాంట్, షుగర్ ఫ్యాక్టరీ, బల్క్ డ్రగ్ పార్క్ బాధితులు కలవనున్నారని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం చేస్తున్న ఆలోచనలు తెలిసిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తన మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం స్పష్టంగా వెల్లడిస్తున్నా.. కూటమి పార్టీల ఎంపీలు, మంత్రులు ఏమీ పట్టనట్లుగా ఉన్నారన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్ సీపీ పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకోవడంతోపాటు ఈ ప్రాంతంలో ఉన్న వనరులను కూటమి నేతలు దోచుకుంటున్నారంటూ మండిపడ్డారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా యూనివర్సిటీలో కనీస మౌలిక వసతులు కల్పించకుండా.. కూటమి నేత సొంత యూనివర్సిటీ కోసం నిర్వీర్యం చేస్తున్నారని వాపోయారు. విద్య, వైద్యాన్ని పూర్తిగా ప్రైవేటీకరణ చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా జీవీఎంసీ పరిధిలోని చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి వారి పొట్టకొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ నెల 9వ తేదీన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట రామయ్య, రాష్ట్ర కార్యదర్శులు చింతకాయల సన్యాసిపాత్రుడు, డిప్యూటీ మేయర్ కె.సతీష్, సీఈసీ సభ్యుడు కోలా గురువులు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి తాడి జగన్నాథ రెడ్డి రాష్ట్ర, క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ, ఎస్ఈసీ సభ్యులు ఉరుకూటి అప్పారావు, బాణాల శ్రీనివాసరావు, డాక్టర్ జహీర్ అహ్మద్, పిన్నమరాజు సతీష్ వర్మ, ఐ.హెచ్.ఫారూఖీ, పోతిన హనుమంత రావు, జోనల్ అనుబంధ విభాగం అధ్యక్షులు అంబటి శైలేష్, తుమ్మలూరు జగదీష్ రెడ్డి, ముట్టి సునీల్ కుమార్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, ఉరుకూటి చందు, బోని శివ రామకృష్ణ, భర్కత్ అలీ, పులగం కొండారెడ్డి, అనిల్ కుమార్, కర్రి రామా రెడ్డి, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, శ్రీదేవి వర్మ, వాసుపల్లి యల్లాజీ, వంకాయల మారుతీ ప్రసాద్, దిలీప్ కుమార్, సకల భక్తుల ప్రసాద్‌రావు, బోండా ఉమా మహేశ్వర రావు, నీలి రవి, పార్టీ ముఖ్యనాయకులు నడింపల్లి కృష్ణరాజు, పిల్లా సుజాత సత్యనారాయణ, అల్లంపల్లి రాజబాబు, పల్లా దుర్గారావు, రామన్నపాత్రుడు, షరీఫ్, వెంకట నారాయణ, చిన్న దాస్, కార్పొరేటర్లు ఎ.శంకర్‌రావు, పీవీ సురేష్, రేయి వెంకట రమణ, ఏడుకొండలరావు, కోరుకొండ స్వాతి దాస్, నక్కిల లక్ష్మీ, సాడి పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, చెన్న జానకి రామ్, గుండపు నాగేశ్వరరావు, వావిలపల్లి ప్రసాద్, శశికళ, సాయి అనూష, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు క్లీన్ ఎనర్జీ ఆవిష్కరణలు

ఇంధన సామర్థ్య నిర్వహణ అమల్లో ఈపీడీసీఎల్ పనితీరును గుర్తించిన ఈఈఎస్ఎల్

సాక్షి, విశాఖపట్నం: అత్యాధునిక, తక్కువ ఖర్చుతో ఇంధన సామర్థ్యాల అమలుపై దృష్టిసారించిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)కు సహకారం అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ ముందుకు వచ్చింది. విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో డిస్కమ్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఈఈఎస్ఎల్ సీఈవో అఖిలేష్ కుమార్ దీక్షిత్‌తో కలిసి సీనియర్ అధికారులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల సేవలను మెరుగుపరచడం, స్థిరమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, భూతాపాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ స్థాయి క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలను అమలు చేసేందుకు అవసరమైన రోడ్‌మ్యాప్ రూపొందించే అంశంపై చర్చించారు. ఇందులో భాగంగా ఈఈఎస్ఎల్‌తో భాగస్వామ్యం ద్వారా విద్యుత్ విని యోగదారుల కోసం ఇ-రిటైల్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టిన దేశంలో మొట్టమొదటి డిస్కంగా ఈపీడీసీఎల్ నిలిచినట్లు ఈఈఎస్ఎల్ సీఈవో అఖిలేష్‌కుమార్ ప్రకటించారు. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ వినియోగదారులు డిస్కం పోర్టల్ ద్వారా నేరుగా స్టార్-రేటెడ్, ఇంధన-సమర్థవంతమైన ఉపకరణాలను పోటీ ధరలకు కొనుగోలు చేయడానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు.



ఈఈఎస్ఎల్ సీఈవో దీక్షిత్ నుంచి విద్యుత్ పొదుపు నివేదికను అందుకుంటున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

ఈపీడీసీఎల్ జాతీయ ఈ-మొబిలిటీ కార్యక్రమం ద్వారా కర్బన ఉద్గారాలు నియంత్రణ, ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సోలార్ రూఫ్‌టాప్, గ్రౌండ్-మౌంటెడ్ ప్రాజెక్టులు నిర్వహణతో విద్యుత్ ఉత్పత్తి, వికేంద్రీకృత సౌర పీవీ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు, స్మార్ట్ మీటర్ నేషనల్ ప్రోగ్రామ్, ఇంధన సామర్థ్య ఉపకరణాలు వినియోగంపై విస్తృత స్థాయి అవగాహన కల్పిస్తున్నట్లు సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు.

జీఎస్టీ 2.0పై విస్తృత అవగాహనకు షాపింగ్ ఫెస్టివల్

మహారాణిపేట : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు విస్తృత అవగాహన కలగజేయడంతోపాటు లబ్ధిని నేరుగా ప్రజలకు అందించేందుకు షాపింగ్ ఫెస్టివల్‌ను ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. సోమవారం 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్'పై కలెక్టరేట్‌లో 2-వీలర్, 4-వీలర్, ఎలక్ట్రానిక్ గృహపకరణాలు, మొబైల్స్, ఫర్నిచర్ తదితర వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ షాపింగ్ ఫెస్టివల్‌లో వ్యాపారస్తులంతా స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పాల్గొనే వారి సంఖ్యను బట్టి స్థలం నిర్ణయించడం జరుగుతుందన్నారు. జీఎస్టీ 2.0 వల్ల చేకూరే లబ్ధిని వివరిస్తూ స్టాల్స్ ముందు బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, ఫెస్టివల్‌కి వచ్చే కస్టమర్లకు ప్రత్యేక డిస్కౌంట్ ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

జాయింట్ కలెక్టర్, జీఎస్టీ నోడల్ అధికారి మయూర్ అశోక్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సూచనలు, సలహాలు ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ ఎస్.శేఖర్, జిల్లా టూరిజం అధికారి మాధవి, రవాణా శాఖ అధికారులు, హోటల్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్, వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

భూములు లాక్కొని పొట్ట కొట్టొద్దు

- తర్లువాడ పంచాయతీ దళితవాడ రైతుల ఆగ్రహం
- ఆందోళనలతో గ్రామసభ వాయిదా



తర్లువాడ దళితవాడలో గ్రామసభ నిర్వహిస్తున్న భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్



గ్రామసభ నుంచి వెళ్లిపోతున్న దళిత రైతులు

తగరపువలస : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీకి చెందిన దళితవాడలో సోమవారం నిర్వహించిన గ్రామసభ.. దళిత రైతుల తీవ్ర ఆందోళన మధ్య వాయిదా పడింది. గూగుల్ టెక్ సంస్థకు భూములు కేటాయించేందుకు ప్రభుత్వం దళితులకు చెందిన డీ పట్టా, బంజరు భూములు సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, తహసీల్దార్ సూరిశెట్టి శ్రీనుబాబుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవనాధారంగా ఉన్న భూములను లాక్కొని పొట్ట కొట్టొద్దని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు తెలియకుండానే తీర్మానం

తర్లువాడ పంచాయతీలో సర్వే నంబర్-1తో పాటు 35, 71, 72, 74, 75లలో ఉన్న సుమారు 350 ఎకరాల భూమిని గూగుల్ టెక్ సంస్థకు ఇవ్వడానికి ప్రభుత్వం సేకరిస్తోంది. అయితే సాగులో ఉన్న రైతులకు, ఇద్దరు దళిత వార్డు సభ్యులకు కూడా తెలియకుండానే పంచాయతీ తీర్మానం చేసి పంపడం రైతుల్లో ఆగ్రహానికి కారణమైంది. అంతేకాకుండా సోమవారం గ్రామసభ నిర్వహిస్తున్న సమాచారం కూడా రైతులకు తెలియనివ్వలేదు. గ్రామ సచివాలయంలో ప్రదర్శించకుండా, దండోరా వేయించకుండా తూతూ మంత్రంగా గ్రామ సభ నిర్వహించడానికి టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నంపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ తరఫున వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు హాజరయ్యారు.

మూడు తరాల జీవనాధారం

1971లో అప్పటి కేంద్ర ప్రభుత్వం 49 మంది దళిత రైతులకు రెండు ఎకరాల వంతున డీ పట్టా భూములు కేటాయించింది. అప్పటి నుంచి మూడు తరాలుగా రైతులు ఈ భూముల్లో తోటపంటలు, కూరగాయలు, పువ్వులు సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. గత ప్రభుత్వాలు బోరుబావులు, విద్యుత్, సోలార్ యంత్రాలు మంజూరు చేసి వ్యవసాయాన్ని ప్రోత్సహించాయని రైతులు గుర్తు చేశారు. ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శవంతమైన ఈ ప్రాంతంలో వ్యవసాయాన్ని తుడిచిపెట్టి సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రతిపాదించడం తమను హత్య చేయడమేనని రైతులు ఆక్రోశం వ్యక్తం చేశారు. గతంలో 80 ఎకరాలు మాత్రమే ఇస్తామని చెప్పి, ఇప్పుడు 200 ఎకరాల వరకు పెంచుకుంటూ పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

భూమి ఇవ్వడానికి నిరాకరణ

ప్రభుత్వం ఎకరానికి రూ.48 లక్షల పరిహారం, ఒకరికి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నాన్ టెక్నికల్ ఉద్యోగం ఇవ్వనుందని అధికారులు ప్రతిపాదించారు. దీనికి ఒక రైతు మాత్రమే అంగీకరించగా, 48 మంది దళిత రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. 'ఒక ఎకరా ఉచితంగా ఇస్తాం, మిగిలిన ఒక ఎకరానికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి పట్టా ఇవ్వాలి' అని రైతులు డిమాండ్ చేశారు. ఈ గందరగోళం, ఆందోళన మధ్య అధికారులు గ్రామసభను వాయిదా వేసుకుని వెనుదిరిగారు.

ఏడాది పొడవునా పంటలు



మేము ఇద్దరం అన్నదమ్ములం. పిల్లలు, మనుమలు అందరూ కలిపి 10 మంది కుటుంబ సభ్యులం. మాకు ఈ భూమే ఆధారం. ఏడాది పొడవునా బీర, ఆనప, మినప, కొర్రలు, సజ్జలు, కందులు, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు పండించుకుని ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు అర్ధాంతరంగా మా భూములు లాక్కొనే బదులు చాలా వరకు బంజరు భూములు ఉన్నాయి. మా పొట్ట కొట్టకండి.

– పైల రాము

అంతా రహస్యమేనా..



పంచాయతీ పాలకవర్గంలో కొండ్రు శంకర్, పైల బంగారమ్మ అనే ఇద్దరు దళిత సభ్యులు ఉన్నారు. వారికి గానీ, రైతులకు గానీ తెలియకుండా భూములు తీసుకోవడానికి పంచాయతీ ఎలా తీర్మానం చేస్తుంది. కనీసం గ్రామసభ పెడుతున్నట్టు కూడా సమాచారం లేదు. టీడీపీ నాయకులు తమ భూములను దొడ్డిదారిన పాస్ పుస్తకాలు చేయించుకొని, మిగిలిన రైతుల భూములను ఫణంగా పెడతామంటే ఊరుకోం.

– రెల్లి రామకృష్ణ

బెదిరిస్తే ఉద్యమిస్తాం



బెదిరించి సాగులో ఉన్న భూములు తీసుకుంటామంటే ఉద్యమిస్తాం. ఇప్పుడు ఈ భూములు కోల్పోతే పేద దళిత కుటుంబాలు అన్నీ రోడ్డున పడిపోతాయి. మాకు వ్యవసాయం తప్ప మరో వ్యాపకం తెలియదు. ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం కుటుంబంలో వాటాలు వేసుకుంటే నెలరోజుల భత్యానికే సరిపోదు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు మాకు అండగా నిలవాలి.

– చందల వెంకన్న

బామ్మ, మనవడ్ని కట్టేసి భారీ చోరీ

- 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు అపహరణ
- యజమాని కారుతో దొంగల పరారీ



బామ్మ, మనవడు



చిందరవందరగా బీరువా

సమయం: ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట

స్థలం: విశాఖపట్నం, రెడ్డి కంచరపాలెం, ఇందిరానగర్-5

ఏం జరిగింది : ఇంట్లోవాళ్లను తాళ్లతో కట్టేసి భారీ చోరీ

మర్రిపాలెం: ఆనంద్‌రెడ్డి ఇల్లు గాఢ నిద్రలో ఉంది. రైల్వే కాంట్రాక్టర్ అయిన ఆనంద్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉన్నారు. ఇంట్లో కేవలం ఆయన తల్లి ఎల్లమ్మ (65), కుమారుడు కృష్ణకాంత్‌రెడ్డి (18) మాత్రమే ఉన్నారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్నప్పటికీ, ఆ సమయంలో ప్రాంతం నిశ్శబ్దంగా ఉంది. ముగ్గురు గుర్తుతెలియని దుండగులు..ముఖాలకు మాస్కులు వేసుకుని పక్కా ప్రణాళికతో ఇంటి వెనుక తలుపుల వద్దకు చేరుకున్నారు. క్షణాల్లో వారు తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. దుండగులు నేరుగా నిద్రిస్తున్న బామ్మ, మనవడి గదిలోకి వెళ్లారు. దుండగులను చూసి తేరుకునేలోపే బామ్మ, మనవడ్ని ప్లాస్టిక్ తాడుతో చేతులు, కాళ్లు గట్టిగా కట్టేశారు. అరుపులు వినిపించకుండా ఉండేందుకు నోటికి ప్లాస్టిక్ టేప్‌లను చుట్టేశారు. ఊపిరి ఆడటానికి కష్టం అవుతున్నా, భయం వారికి మాట రాకుండా చేసింది. నిస్సహాయంగా కళ్ల ముందు జరుగుతున్న దోపిడీని వారు వీక్షించాల్సి వచ్చింది. బాధితులను బంధించిన తర్వాత, దొంగలు ఇంట్లో వెతకడం ప్రారంభించారు. ఎల్లమ్మ మెడలోని బంగారు ఆభరణాలు తెంచుకున్నారు. కృష్ణకాంత్‌రెడ్డి చేతికి ఉన్న డైమండ్ రింగ్ లాక్కున్నారు. బీరువాను పగలగొట్టి, అందులో దాచిన పది తులాల బంగారం వస్తువులు, రూ. 3 లక్షలు చేజిక్కించుకున్నారు. ఆ తర్వాత.. దుండగులు తాము దొంగిలించిన వస్తువులను బ్యాగుల్లో సర్దుకున్నారు. అంతటితో ఆగకుండా ఇంటి యజమాని ఆనంద్‌రెడ్డికి చెందిన మహేంద్ర ఎక్స్‌యూవీ కారుతో పరారయ్యారు. సోమవారం ఉదయం స్థానికుల సహాయంతో విడిపించుకున్న ఎల్లమ్మ, కృష్ణకాంత్‌రెడ్డి హుటాహుటిన కంచరపాలెం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెస్ట్ క్రైమ్ సీఐ చంద్రమౌళి కేసు నమోదు చేసి, వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ చంద్రమౌళి, ఫోరెన్సిక్ టీమ్ ఇంటి వెనుక తలుపుల వద్ద పగిలిన భాగాలను, లోపల చెల్లాచెదురైన బీరువాను పరిశీలించారు. దొంగల కోసం వెస్ట్ క్రైమ్ సీఐ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. దుండగులు తీసుకువెళ్లిన మహేంద్ర ఎక్స్‌యూవీ కారు నంబర్‌తో నగరంలోని అన్ని అవుట్‌పోస్టులకు సమాచారం అందించారు. కారును మారిక వలస వద్ద విడిచిపెట్టి పరారైనట్టు పోలీసులు గుర్తించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ చంద్రమౌళి తెలిపారు.

కుక్కల పట్టివేత... డెబ్రిస్ తరలింపు

సాక్షి ఎఫెక్ట్..



డంప్ చేసిన డెబ్రిస్‌ను తొలగిస్తున్న సిబ్బంది

కొమ్మాది: రాష్ట్రంలో ఏకైక అంతర్జాతీయ గుర్తింపు పొందిన (బ్లూ ఫ్లాగ్) రుషికొండ బీచ్ నిర్వహణ అధికారులు గాలికి వదిలేశారు. దీనిపై ఈ నెల 4వ తేదీన సాక్షి దిన పత్రికలో 'బ్లూ ఫ్లాగ్ గుర్తింపు అపహాస్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బీచ్ వద్ద పెద్ద ఎత్తున డెబ్రిస్ డంప్ చేయడం, చిల్డ్రన్స్ పార్కు నీట మునగడం, కుక్కలు, పశువులు బీచ్‌లో సంచరించడంతో పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రచురించిన కథనానికి సోమవారం అధికారులు చర్యలు చేపట్టారు. బీచ్ వద్ద డంప్ చేసిన డెబ్రిస్‌ను తొలగించారు. చిల్డ్రన్స్ పార్కును మట్టితో చదును చేశారు. అదే విధంగా జీవీఎంసీ సిబ్బందితో కుక్కలను పట్టుకుని వేరొక చోటుకు తరలించారు. దీనిపై పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 81 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మలు ఫిర్యాదులు స్వీకరించారు. అందిన 81 వినతుల్లో జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 5 ఫిర్యాదులు రాగా, పట్టణ ప్రణాళిక విభాగానికి అత్యధికంగా 46, ఇంజినీరింగ్ సెక్షన్‌కు 12, మొక్కల విభాగానికి 2, యూసీడీకి 6 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, ప్రధాన సిటీ ప్లానర్ ప్రభాకరరావు, డీసీఆర్ శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజినీర్లు కె.శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, గోవిందరావు, డీడీహెచ్ దామోదరరావు, డీసీపీలు హరిదాసు, కె.వెంకటేశ్వరరావు, రామ్మోహన్, మధుసూధనరావు, యూసీడీ పీఓ ప్రసన్నవాణి పలువురు అధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి





మృతుడు హరీష్, కొత్త బైక్

బీచ్‌రోడ్డు: దసరా పండుగ సందర్భంగా కొనుగోలు చేసిన కొత్త ద్విచక్రవాహనం ఓ యువకుడికి శాపంగా మారింది. బైక్ కొనుగోలు చేసిన నాలుగు రోజులకే జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాణిపేట నివాసి సీరందాస్ హరీష్ (19) దుర్మరణం పాలయ్యాడు. మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఈ వివరాలను అందించారు. పోలీసుల వివరాల ప్రకారం..హరీష్ ఆదివారం అర్ధరాత్రి తన స్నేహితుడు వినయ్‌తో కలిసి రూ. 2.80 లక్షల విలువైన యమహా ద్విచక్రవాహనంపై టిఫిన్ చేయడానికి కాంప్లెక్స్‌కు వెళ్లాడు. టిఫిన్ ముగిసిన తర్వాత తిరిగి వస్తుండగా, దత్త ఐల్యాండ్ మలుపు వద్ద బైక్ అతి వేగం కారణంగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న హరీష్‌కు తీవ్ర గాయాలు తగిలాయి. వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెనకాల కూర్చున్న వినయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

తీరని విషాదం

తండ్రి శ్రీనివాసరావుతో గొడవపడి మరీ దసరాకు బైక్ కొనిపించుకున్నాడు. హరీష్ మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనధికార బాణసంచా దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడుల్లో బయటపడ్డ మందుగుండు సామగ్రి

ఎంవీపీకాలనీ: దీపావళి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో, శివారు ప్రాంతాల్లో అనధికార బాణసంచా దుకాణాలపై సిటీ టాస్క్‌ఫోర్స్ కొరడా ఝులిపిస్తోంది. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎంవీపీ కాలనీలోని టాస్క్‌ఫోర్స్ టీమ్ రెండు రోజులుగా నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముమ్మర తనిఖీలు చేపట్టింది. ఈ దాడుల్లో అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న దుకాణాలపై దాడులు చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా సామగ్రిని విక్రయిస్తున్న ఆనందపురం మండలం బొడ్డపాలెంకు చెందిన లక్ష్మి, నెల్లేరుకు చెందిన దాసరి దేముడు, భీమిలి మండలం ఎగువపేటకు చెందిన బడిదబోయిన గంగాధర్, పద్మనాభం మండలం అచ్చుకున్నపాలెంకు చెందిన గేదెల రమణపై కేసులు నమోదు చేసి..ఆయా పోలీస్‌స్టేషన్లకు వీరిని అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం వెల్లడించారు. అనధికారిక బాణసంచా దుకాణాలపై 112కు గాని, 79950 95799 నంబర్‌కు గాని ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

డీజే సౌండ్‌కు వ్యక్తి మృతి



త్రినాథ్ (ఫైల్)



మరణించే ముందు డ్యాన్స్ చేస్తున్న త్రినాథ్

పెందుర్తి: మండలంలో పెదగాడి గ్రామంలో ఆదివారం రాత్రి కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన ఊరేగింపులో ఏర్పాటు చేసిన డీజే సౌండ్‌కు గ్రామానికి చెందిన అప్పికొండ (56) మృతి చెందాడు. దుర్గాదేవి ఊరేగింపులో శ్రుతిమించిన సౌండ్ పెట్టడంతో త్రినాథ్ కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అప్పటి వరకు త్రినాథ్ డీజే సౌండ్‌కు డ్యాన్సు చేశాడు. ఉన్నట్టు ఈ పరిణామం చేసుకోవడంతో స్థానికులు విషాదంలో మునిగిపోయారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వాస్తవానికి ఊరేగింపుల్లో డీజే సౌండ్‌కు ఎలాంటి అనుమతి లేదని పోలీసులు చెపుతున్నా కూటమి నాయకులు ఆ నిబంధనలు ఎక్కడా పాటించలేదు. నియోజకవర్గంలో కూటమి ముఖ్యనాయకులతో పాటు చోటా మోటా నాయకులు సైతం పోలీసుల తీవ్ర వత్తిడి తెచ్చి డీజే సిస్టమ్స్ ప్లే చేస్తున్నారు. ఈ క్రమంలో డీజే శబ్దాలకు ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

29 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత

మహారాణిపేట: వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేసేందుకు, కారుణ్య నియామకాల కింద ఎంపికైన 29 మందికి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సోమవారం నియామక పత్రాలను అందజేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్. భవానీ శంకర్ పాల్గొన్నారు. నియామక పత్రాలు పొందినవారిలో 16 మంది జూనియర్ అసిస్టెంట్లు, 8 మంది టైపిస్టులు, ఐదుగురు ఆఫీసు సబ్-ఆర్డినేట్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియమితులైన వారు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

ప్రజల సంపూర్ణ సహకారంతోనే విశాఖ అభివృద్ధి

నందడిగా స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీ శ్రీ భరత్



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

బీచ్‌రోడ్డు : ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో కీర్తిప్రతిష్టలు గడించిన విశాఖను మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎంపీ ఎం. శ్రీభరత్ పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. నగర పరిశుభ్రత విషయంలో ప్రజల్లో మార్పు రావాలని, ఈ దిశగా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్'కు 80 శాతం మంది ప్రజలు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఫుట్‌పాత్‌లు కేవలం ప్రజలు నడవడానికి మాత్రమేనని, వాటిని వ్యాపార ఆక్రమణలకు ఉపయోగించవద్దని స్పష్టం చేశారు. సింగపూర్ పర్యటన అనుభవాలను పంచుకుంటూ, అక్కడ జంతువులతో పాటు మనుషుల జీవన విధానాన్ని ప్రతిబింబించే 'బయో ఫ్లెక్స్ సిటీ' విధానాన్ని జూ పార్క్, కైలాసగిరి ప్రాంతాల్లో అధ్యయనం చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ప్లాస్టిక్ జెండాలు, ఫ్లెక్సీలకు బదులుగా డిజిటల్ బోర్డులు వినియోగించాలని సూచించారు.

స్వర్ణాంధ్ర సాధించాలంటే స్వచ్ఛాంధ్ర ముఖ్యం : కలెక్టర్

కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాధించాలంటే ముందుగా స్వచ్ఛాంధ్ర సాధించాలని అన్నారు. జిల్లాలో పరిశుభ్రత కోసం ప్రతి మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లా 45 జిల్లా స్థాయి, 7 రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, విష్ణుకుమార్ రాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నాగలక్ష్మి, రాము, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీకి స్వచ్ఛాంధ్ర అవార్డు

డాబాగార్డెన్స్: స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఏపీఎస్ ఆర్టీసీ ఎంపికైంది. నగరంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు అందుకున్నారు.

పీజీఆర్ఎస్‌కు 'రెవెన్యూ' సమస్యలే అధికం

- అధికారులపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్
- పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులే అధికంగా వస్తున్నాయి. అయితే వాటి పరిష్కారం మాత్రం ఆలస్యమవుతోంది. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 248 వినతులు అందగా, అందులో 86 రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి కాగా, జీవీఎంసీకి 66, పోలీస్ శాఖకు 16, ఇతర విభాగాలకు 80 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుల సంఖ్య తగ్గకపోవడంపై కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్లకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినా, పీజీఆర్ఎస్‌కు మళ్లీ మళ్లీ అర్జీదారులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జీవీఎంసీ పరిధిపై ఫిర్యాదులు ఎక్కువ అనుకున్నా, ఇప్పుడు 11 తహసీల్దార్ కార్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని గుర్తించారు. అధికారులు అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని, నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అధికారులు అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకుని సంతృప్తికర పరిష్కారం చూపాలని, తద్వారా అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. ఎండార్స్‌మెంట్‌ను సక్రమంగా ఇవ్వకపోవడం వల్లనే దరఖాస్తులు రీ-ఓపెన్ అవుతున్నాయని, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో ఈ సమస్య ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన అర్జీలను చూడని అధికారులపై, అలాగే పరిష్కారంలో అలసత్వం వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వారికి, రానివారికి మెమోలు జారీ చేయాలని డీఆర్వోను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెనుకబడిన కులాల అభ్యున్నతికి కులగణన చేపట్టాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్



ఐక్యత చాటుతున్న నేతలు

అల్లిపురం : సమాజంలో వెనుకబడిన కులాల అభ్యున్నతికి కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో కులగణన కోసం క్షేత్రస్థాయి నుంచి ఒత్తిడి తీసుకురావాలన్నారు. అవసరమైతే చలో అమరావతికి సిద్ధం కావాలని కోరారు. తెలంగాణలో కులగణన నిర్వహించారని చెప్పారు. రాష్ట్రంలో 143 బీసీ కులాలు ఉంటే 10-12 కులాలకు చెందినవారు మాత్రమే అభివృద్ధి చెందారన్నారు. మిగిలిన కులాలవారు ఇంకా వెనుకబడి ఉన్నారని తెలిపారు. బంగారు కుటుంబాల పేరుతో పేదలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం ధనికులను కోరుతోందని, వారి దయాదాక్షిణ్యాలపై పేదలు బతకాలా? అని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు, ప్రధాన కార్యదర్శి ఎర్ని శ్రీనివాసరావు, నగరాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జగపిళ్ల అప్పలరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు, ఉత్తరాంధ్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్. సుధాకర్, బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, వాడబలిజ సంక్షేమ సంఘం నాయకుడు వాసుపల్లి జానకీరాం, బీసీ సంఘం నాయకురాలు డాక్టర్ బీసీఎస్ కల్యాణ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సీపీఐ కార్యదర్శులతో పాటు పలువురు బీసీ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

9న అప్రెంటీస్‌షిప్ అవగాహన వర్క్‌షాప్

డాబాగార్డెన్స్: లైఫ్ సైన్సెస్ స్కిల్ సెక్టార్ డెవలప్‌మెంట్, జేఎన్‌పీసీఎంఏ సంయుక్తంగా నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీంపై అవగాహనకు ఈ నెల 9న వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ సౌతిండియా హెడ్ అమరేంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్ పరవాడలోని జేఎన్‌పీసీఎంఏ కార్యాలయం, ఏపీఐఐసీ ఫేజ్-3లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్క్‌షాప్‌నకు వివిధ కంపెనీల హెచ్ఆర్ హెడ్స్, ప్లాంట్ మేనేజర్లు, సైట్ హెడ్స్, ట్రైనింగ్ అండ్ కాంప్లియన్స్ ఆఫీసర్స్, సీఎస్సార్ హెడ్స్ హాజరుకావాలని కోరారు. ఆ రోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు వర్క్‌షాప్ ఉంటుందన్నారు. వర్క్‌షాప్‌లో స్టైఫండ్ నూతన నియమావళి, ప్రభుత్వ సాయం, సీఎస్సార్ ఫండ్ వినియోగం, మానవ వనరుల అభివృద్ధి తదితర అంశాలను వివరించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 8800 282 887 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.